క్లుప్తంగా

పాఠశాలల పరిశీలన

తాడూరు: మండలంలోని ఐతోలు పాఠశాలను ఎంఈఓ భాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను, తరగతిగదిలో బోధన వివిధ అంశాలను తెలుసుకున్నారు.

పనులు వేగిరం చేయాలి

లింగాల: మండలంలోని మగ్దూంపూర్‌లో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ క్రీడా మైదానం పనులను సోమవారం ఎంపీడీఓ గీతాంజలి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఎంపీడీఓ సర్పంచ్ హన్మంత్‌నాయక్‌కు సూచించారు.

హక్కులను సాధిద్దాం

వెల్దండ: ముదిరాజ్‌లందరూ ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు లింగం ముదిరాజ్, ఎర్ర శ్రీనుముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 11న స్థానిక బ్రహ్మగిరి ఆలయంలో ప్రత్యేక సమావేశంలో ఉమ్మడి మండల కమిటీని ఎన్నుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేష్, దేవేందర్, బాల్‌రాజ్, కొండల్, శ్రీను పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

చారకొండ: మండలంలోని సారంబండ తండాలో ఎంపీడీఓ జయసుధ సోమవారం పర్యటించి నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం వాటి నిర్వహణపై ఆరా తీశారు. బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు నాటడం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతివనం, ఎవెన్యూ ప్లాంటేషన్, క్రీడా మైదానం తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

చారకొండ: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని మండలంలోని జూపల్లికి చెందిన నాయకులు పాలాది బాలరాజు, మల్లేష్, ప్రశాంత్, నాగరాజు తదితరులు కలిసి సన్మానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పేదలకు అండగా ప్రభుత్వం

ఊర్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండల కేంద్రంలో సోమవారం 52 మంది లబ్ధిదారులకు ఎంపీపీ రాధ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, కో ఆప్షన్ ఖలీం పాష, వైస్ ఎంపీపీ అరుణ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ జాకీర్ అలీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరారెడ్డి, సర్పంచ్‌లు పర్వత్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు నిల్

లింగాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అటు అధికారులు, ఇటు ఫిర్యాదుదారులు లేకపోవడంతో వెలవెలబోయింది. ప్రజావాణికి ఒకరిద్దరు మండల స్థాయి అధికారులు తప్పా ఇతర శాఖల వారు రాలేదు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినాబేగం, ఏఓ నాగార్జునరెడ్డి, రవి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తి రూరల్/వెల్దండ: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆంజనేయగౌడ్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, రాజశేఖర్, సాయినాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో సినీ నిర్మాత శిరీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, అంజి, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించండి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని బహుజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఇండస్ట్రియల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులు డిగ్రీలు, పీజీలు, ఎంబీఏలు, ఎంసీఏలుగా పట్టాలు పొంది సర్టిఫికెట్లతో హైదరాబాద్, వివిధ నగరాల్లో ఉపాధి కోసం తిరుగుతున్నారని తెలిపారు. చివరకు బతుకు కష్టమై లారీ డ్రైవర్లుగా, క్లీనర్లుగా మారుతున్నారని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య నాయకులు లక్ష్మణ్, అశోక్, రాజశేఖర్, లక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పంపిణీ చేయాలి

కొల్లాపూర్: రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేపట్టాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శివకృష్ణయాదవ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాథోడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ హనుమానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్‌యోజన, అంత్యోదయ అన్నయోజన ద్వారా రేషన్ లబ్ధిదారులకు కేంద్రం బియ్యం పంపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బియ్యం పంపిణీలో ఆలస్యం అవుతోందని ఆరోపించారు.

నిధులు లేకుండా పనులెలా చేపట్టాలి?

- మండల సమావేశాన్ని బహిష్కరించిన కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



కింద కూర్చొని నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ఉప్పునుంతల: గ్రామ పంచాయతీలకు వచ్చే ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు తొమ్మిది నెలలుగా రావడం లేదు.. వచ్చే అరకొర నిధులు ట్రాక్టర్ ఈఎంఐ, కరెంట్ బిల్లులకే సరిపోక అప్పులు చేస్తున్నాం.. పనులు సకాలంలో పూర్తిచేయకపోతే సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ అధికారులు బెదిరిస్తున్నారు.. పంచాయతీలకు వచ్చే నిధులే సరిగా ఇవ్వకపోతే ఇక పనులు ఎలా చేయాలని ప్రతపక్ష కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను నిలదీశారు. ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సమావేశాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బహిష్కరించి నిరసన తెలిపారు. సమావేశం ప్రారంభంలోనే గత సర్వసభ్య సమావేశాల్లో చేసిన తీర్మానాలు, అధికారుల దృష్టికి సభ్యులు తెచ్చిన సమస్యలను ఎంతవరకు పరిష్కరించారో చెప్పాలని వైఎస్ ఎంపీపీ వెంకటేష్, సర్పంచ్‌లు కట్టా సరిత, లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, పుష్పావతి, ఊర్మిళ, ఎంపీటీసీ రంగారెడ్డి, అనురాధ, మల్లయ్య అధికారులను నిలదీశారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు.

సమస్యలపై చర్చ..

మిషన్ భగీరథ పనులు ఇప్పటికీ సరిగా పూర్తి చేయకపోవడంతో పాటు గ్రామాల్లో పైప్‌లైన్ కోసం సీసీ రోడ్లను ధ్వంసం చేశారని సర్పంచ్ కట్టా సరిత ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభించి ఇన్ని రోజులైనా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించలేదని తెలిపారు. దేవదారికుంట తండా పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరినందునా భవనం మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ కోరారు. వెల్టూర్ చెరువు కింద ఉన్న నీటి కాల్వ ఆక్రమణకు గురై రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ రంగారెడ్డి తెలిపారు.

కింద కూర్చొని నిరసన..

సమావేశంలో విద్యుత్‌శాఖకు సంబంధించిన ఎజెండాపై చర్చ జరుగుతుండగా, కంసానిపల్లి ఫీడర్‌కు తరచూ అంతరాయం కల్గుతుండటంతో తాడూరు సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ లక్ష్మీనారాయణ కోరారు. విద్యుత్ లైన్‌ను విస్తరించాలని కోరగా, గ్రామ పంచాయతీ నుంచి డబ్బులు చెల్లిస్తే విద్యుత్ స్తంభాలు, లైన్ విస్తరణ పనులు చేపట్టే అవకాశం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ అమర్‌సింగ్ చెప్పడంతో సభ్యులు సమావేశం స్టేజీ ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.91లక్షలు, ఎస్‌ఎఫ్‌సీ నిధులు రూ.34లక్షలు వచ్చినట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సభ్యులకు వివరించారు. పంచాయతీ ఖాతాల్లో జమ అయ్యి చెక్కులు పాస్ అవుతాయని తెలిపారు. సమావేశంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, జెడ్పీటీసీ అనంత ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు సన్మానం..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అరుణను మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. ఇటీవల కొత్తగా మార్కెట్ చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టినందుకు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

అచ్చంపేట రూరల్: అందరి సహకారంతో అచ్చంపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను రద్దు చేస్తున్నామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీల ఏర్పాటుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను అనుసరించి ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎట్టి పరిస్థితుల్లో ఫ్లెక్సీలు కట్టవద్దని సూచించారు. వార్డులోని సమస్యలను పరిష్కరించేందుకు వార్డుకు నల్గురి చొప్పున సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. హిందూ శ్మశాన వాటికలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పట్టణ ప్రగతిలో చేపడుతామన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పలు సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కమిషనర్ బలరాంనాయక్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ సమస్యను అట్రాసిటీకి దిగజార్చారు



లిఫ్ట్ శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

బిజినేపల్లి: అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు రిజర్వాయర్ సమస్యను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వరకు దిగజార్చారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శాయిన్‌పల్లిలో మార్కెండేయ లిఫ్ట్ శిలాఫలకాన్ని బీఎస్పీ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమార్ మాట్లాడుతూ మార్కెండేయ లిఫ్ట్ నినాదంతో 2018 ఎన్నికల్లో ప్రచారం చేసి గెలిచిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. 2022 సంవత్సరంలో కేటీఆర్ చేతుల మీదుగా రిజర్వాయర్ శిలాఫలకం ఏర్పాటులో అంతర్యాన్ని ప్రశ్నించారు. మర్రి, నాగం, కుచుకూళ్ల కుటుంబాలు రాజకీయ లబ్ధిలో భాగంగా బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపిస్తే ప్రజల పక్షాన నిలబడుతామని తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

తెలకపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బొప్పల్లిలో ప్రీమియర్ లీగ్ బీపీఎల్ ఆటల పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు పృథ్వీరాజ్, ఆనంద్, శివశంకర్, రాజేశ్, మల్లేశ్, సుల్తాన్, రాజేందర్, విష్ణు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం



మాట్లాడుతున్న భుజంగరావు

కల్వకుర్తి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతును గెలిపించుకుందామని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ బలపరిచిన భుజంగరావు సోమవారం కల్వకుర్తి పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన వారందరూ ప్రభుత్వ భజనపరులుగా మారి విద్యారంగ సమస్యలను గాలికొదిలేశారన్నారు. 317 జీఓ ఎంతో మంది ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీలు, పదోన్నతులు నాలుగు సంవత్సరాలుగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, ఉపాధ్యాయులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పర్వత్‌రెడ్డి, సుదర్శన్, రాజేంద్రప్రసాద్, చెన్నకేశవులు, జంగయ్య, జమీల్ అహ్మద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ రద్దుకు డిమాండ్

కొల్లాపూర్: అంగన్‌వాడీ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ పోషకాహారం పంపిణీ సమయంలో ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌కు పోషణ్ ట్రాకర్ ట్యాలీ కాకపోవడం వల్ల అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు నీరజ, చెన్నమ్మ, లక్ష్మీ, శ్రీశైలమ్మ, సఫియా, రేవతి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పార్వతమ్మ కోరారు. సోమవారం ఏసీడీపీఓ కమలకు వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి కోసమే పాదయాత్ర

కొల్లాపూర్ రూరల్: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడుఎల్లేని సుధాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లి, ఎన్మన్‌బెట్ల గ్రామాల్లో ప్రగతి కోసం పాదయాత్ర నిర్వహించారు. చింతలపల్లిలో ఆయన బీజేపీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొల్లాపూర్ ప్రాంతాన్ని సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయడం కోసం పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు.

అయ్యప్ప భక్తుల పూజలు

తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట అయ్యప్ప ఆలయ ఆవరణలో సోమవారం అయ్యప్ప భక్తులు యజ్ఞాలు, అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాలధరించిన భక్తులు శబరిమల వెళ్లిన దృష్ట్యా పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో సోమవారం సింగిల్ విండో చైర్మన్ ఎండీ సమ్మద్‌పాష అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ముందస్తు అరెస్టు

కొల్లాపూర్: ఎస్‌ఐ, పోలీసు రాత పరీక్షల్లో చోటుచేసుకున్న తప్పులను సరిచేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో డీవైఎఫ్‌ఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం ఉదయం డీవైఎఫ్‌ఐ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు శివవర్మ, మహిమూద్, భాస్కర్, రామకృష్ణ, చందు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో అభ్యర్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఉపాధ్యక్షులు కేశవులు, శివకృష్ణ, లక్ష్మీపతి, స్వామి, రామకృష్ణ, ధర్మ ఉన్నారు.

అహింస మార్గంలో నడుద్దాం



కొల్లాపూర్: హింసకు చోటులేకుండా అహింసామార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్లు సూచించారు. పత్రీజీ శాఖాహార జగత్ ఆశయంలో భాగంగా కొల్లాపూర్‌లో స్పిరుచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. మాంసాహారం వద్దు-శాఖాహారమే ముద్దు, జీవహింస మహాపాపం అంటూ నినదించారు. అనంతరం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 11వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ధ్యాన కేంద్రాల మాస్టర్లు మారం శివప్రసాద్, కళాధర్, దామోదర్‌రెడ్డితో పాటు పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, జయశ్రీ, శ్రీనివాసులు, సత్యం, సావిత్రమ్మ, ఇందిరమ్మ, బూషయ్య, సుభాస్, సత్యం, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: మండలంలోని గౌరారంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని గౌరారంలో ఎమ్మెల్యే 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 44వ సర్వేనంబర్ పరిధిలోని భూములను సర్వే చేసి, తక్షణమే రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందేలా చూడాలని తహసీల్దార్ అంజిరెడ్డికి సూచించారు. అంతేకాక ముదిరాజ్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ల ఏర్పాటు కోసం రూ.10లక్షల ఏర్పాటు చేస్తానని, గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణానికి, సీసీ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఏఈ బస్వలింగానికి సూచించారు. గ్రామంలో కంపచెట్లు జేసీబీ సాయంతో తొలగించాలని గ్రామ కార్యదర్శికి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమాకు ఘన నివాళి



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న మహిళలు

అచ్చంపేట రూరల్: దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు దివంగత షేక్ ఫాతిమా జయంతిని సోమవారం అచ్చంపేటలో నిర్వహించారు. ఎమ్మార్పీ భవనం ఎదుట ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీటీఏ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, జీహెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి, బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: చదువుల తల్లి సావిత్రీబాయి పూలే అనుచరురాలు ఫాతిమా షేక్ జయంతిని సోమవారం కల్వకుర్తిలో ఘనంగా నిర్వహించారు. పూలే జయంతి కమిటీ ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రేష్మ, రెహాన, రాజేశ్వరి, మాలతి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీని రూపుమాపాలి



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ శ్రీకాంత్‌రెడ్డి

మన్ననూర్: గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి హెచ్‌ఐవీని దూరం చేయడంతో పాటు పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ జిల్లా రిసోర్స్‌పర్సన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మన్ననూర్‌లోని పీహెచ్‌సీని సందర్శించిన సంస్థ బృందం వైద్యాధికారి సుధాకర్, ఎల్‌టీ హరినాయక్‌లతో పాటు ఆసుపత్రి సిబ్బందికి హెచ్‌ఐవీ నివారణకు క్షేత్ర స్థాయిలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, విధి విధానాలను వివరించారు. సెక్స్ వర్కర్లు, ఒంటరి మహిళలు, గర్భిణులకు టీ ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధిని కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చైల్డ్ ఫండ్ ఇండియా జిల్లాలో లింక్ వర్కర్ పథకంతో 40 గ్రామాల్లో పనిచేస్తుందని అన్నారు. మన్ననూర్ పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా నిర్ధారణ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ప్రింటర్ వితరణ

ఉప్పునుంతల: మండలంలోని కంసానిపల్లి ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఎంపీటీసీ అనురాధ, లయన్ రఘుపతిరెడ్డి విద్యార్థుల సౌకర్యార్థం కలర్ ప్రింటర్‌ను వితరణ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపీటీసీ అనురాధ రఘుపతి రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు సరళ, అంబిక, అంజనేయులు పాల్గొన్నారు.




విద్యార్థుల ప్రతిభ



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలను గెలుచుకున్నారు. ఆదివారం జడ్చర్లలో నిర్వహించిన సౌత్ ఇండియా నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో సీనియర్స్ విభాగంలో పాఠశాలలో 9వ తరగతి చెందిన సాకేత్, సాయికిరణ్, సాయిసిరిలు, జూనియర్స్ విభాగంలో పూర్ణేష్, జోయాలు బంగారు పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులతో పాటుగా, తల్లిదండ్రులు వారిని అభినందించారు.

ఇన్‌స్పైర్ నామినేషన్‌కు ఎంపిక..



అచ్చంపేట రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థులు శివాని, అంజలి జిల్లా ఇన్‌స్పైర్ నామినేషన్లకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల జీహెచ్ఎం జె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థినను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావాలని అభినందించారు.

ప్రతిభ పరీక్షకు ఎంపిక..



తెలకపల్లి: ఈనెల 7న జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సాంఘికశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు సాంఘికశాస్త్ర ప్రతిభ పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష తెలుగు మీడియం విభాగంలో ద్వితీయ స్థానం సాధించి ఈనెల 19న రాష్ట్ర స్థాయిలో జరగబోయే సాంఘికశాస్త్ర ప్రతిభ పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు. శిరీషను ఎంఈఓ చంద్రుడుతో పాటు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు వెంకటేశ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సరుకుల పంపిణీ

మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని రాంపూర్ పెంటలో రెండు రోజుల కిందట అంకులయ్య పూరి గుడిసె దగ్ధమైన సంఘటనలో బాధిత కుటుంబానికి అటవీశాఖ తరుపున సోమవారం సాయం అందించినట్లు ఎఫ్ఆర్‌ఓ ఈశ్వర్ తెలిపారు. దుప్పట్లు, కూరగాయలు, వంట సామగ్రి, కిరాణ సరుకులు, 30కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌ఓలు రామాంజనేయులు, ముజీబ్, బీఎఫ్ఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

తెలకపల్లి: క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హనుమంతురావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బాబు జగ్జీవన్‌రాం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడలతో స్నేహాభావం పెంపొందుతని హనుమంతురావు, ఎంపీపీ మధు అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీలు రమేశ్, లక్ష్మమ్మ, సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, మాదవరెడ్డి పాల్గొన్నారు.

16న అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో సంక్రాంతి పండుగ సందర్భంగా అంతరాష్ట్ర క్యాటగిరి బండలాగుడు పోటీలు ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎల్లయ్య ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

కోడేరు: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 17న అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు చామంతి రాజు, రామకృష్ణ, రాములు, చెన్నకేశవులు, అశోక్, శ్రీశైలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9963377003, 9110786149, 9581858637 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

12న క్రికెట్ టోర్నమెంట్

చారకొండ: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జూపల్లిలో ఈనెల 12 నుంచి సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రశాంత్, చరణ్, తిరుపతి, మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఎంట్రీఫీజు రూ.వెయ్యి చెల్లించి టీం పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల వారు 9603137305, 9666396294 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీఓనంబర్ 26ను రద్దు చేయాలి

అచ్చంపేట రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని, శిక్షణా కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓనంబర్ 26ను రద్దు చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేశ్వర్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లోకి చేరి మూడేళ్లవుతున్నా క్రమబద్ధీకరించకపోవడం సరికాదన్నారు.

మన్ననూరులో వైద్యశిబిరం

మన్ననూర్: స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్, ఎంఎన్‌జే హైదరాబాద్, వనవాసీ కల్యాణ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ నిర్ధారిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ భుజంగరావ్ ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన 91 మంది రోగులకు వైద్యులు సౌజన్య, సావిత్రి, అక్షితలు గొంతు, రొమ్ము, గర్భకోశ క్యాన్సర్ నిర్ధారణ స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఎల్ఎన్‌జే హైదరాబాద్‌లో క్లబ్ ఆధ్వర్యంలో వ్యాధి నయం చేయించి ఉచి తంగా మందులు అందిస్తామన్నారు.

నోటు పుస్తకాల అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ డివిజన్ కార్యదర్శి వెంకటరమణ, సర్పంచ్ రమాదేవి, క్లబ్ కార్యదర్శి లక్ష్మీ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం

కొల్లాపూర్: అనారోగ్యంతో మృతిచెందిన ఫొటోగ్రాఫర్ వెంకటరమణ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు శ్రీనివాసులు, సురేష్‌గౌడ్, మహెబూబ్, హసన్‌పీరా, షబ్బార్, హఫీజ్ పాల్గొన్నారు.

సారా పట్టివేత

అచ్చంపేట రూరల్: నిషేధిత సారాను అక్రమంగా సరఫరా చేస్తున్న వ్యక్తిని సోమవారం అచ్చంపేట ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని లింగోటం తండా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అచ్చంపేటకు చెందిన మత్రు తన స్కూటీపై 15లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నారు. అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. నిషేధిత నల్లబెల్లం, నాటుసారాను సరఫరా చేసినా, అమ్మినా చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్ హెచ్చరించారు.